# మహాభారతంలో అర్జునుడిగా?




'పుష్ప' ఫ్రాంచైజీ తర్వాత అల్లు అర్జున్ ఇమేజ్ పూర్తిగా మారిపోయింది. బన్నీ విషయంలో దేశవ్యాప్తంగా ఉన్న లెజెండరీ యాక్టర్ల దృక్కోణంలో కూడా మార్పు వచ్చింది. జాతీయ ఉత్తమనటుడిగా ఎంపిక కావడం, లెజెండ్ అమితాబ్ సైతం బన్నీని పొగడటం ఇవ్వన్నీ కూడా అందుకు కారణాలు కావొచ్చు. దేశంలో వందల కోట్లతో నిర్మించే భారీ ప్రాజెక్టులన్నీ ఇప్పుడు బన్నీవైపు చూస్తున్నాయి. రీసెంట్‌గా అట్లీ సినిమా పనిమీద ముంబయ్ వెళ్లిన బన్నీనీ.. బాలీవుడ్ స్టార్ అమీర్‌ఖాన్ కలిశారు. ఇది పూర్తిగా ప్రొఫెనల్ మీటింగ్ అని తెలుస్తున్నది. అమీర్‌ఖాన్ తన 'మహాభారతం' ప్రాజెక్ట్ కోసమే అల్లు అర్జున్‌ని కలిశారని బీటౌన్ టాక్. ఇందులో శ్రీకృష్ణుడిగా తానే నటిస్తానని ఆమీర్‌ఖాన్ గతంలోనే ప్రకటించారు. ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్ట్‌లో అర్జునుడి పాత్రను బన్నీతో చేయించాలని అమీర్‌ఖాన్ భావిస్తున్నారట. అందుకే బన్నీని ఆయన కలిశారట. ఈ సినిమాను ఐదు భాగాలుగా తీయాలనేది అమీర్ డ్రీమ్. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. తొలి భాగాన్ని సంజయ్‌లీలా బన్సాలీ దర్శకత్వం వహిస్తారట. ఈ మధ్యకాలంలో సంజయ్ కూడా ఒకట్రెండుసార్లు ముంబయ్‌లో బన్నీని కలిశారు. దీంతో 'మహాభారత్' ప్రాజెక్ట్ కోసమే ఈ మీటింగులని తెలుస్తున్నది. అల్లు అర్జున్‌తో త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ పౌరాణిక చిత్రాన్ని నిర్మించనున్నట్టు సదరు చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఇటీవల ప్రకటించారు. అమీర్‌ఖాన్ స్పీడ్ చూస్తుంటే.. దానికంటే ముందే.. 'మహాభారతం'లో బన్నీ అర్జునుడిగా పౌరాణిక పాత్రలో కనిపిస్తాడేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు. దక్షిణాదికి చెందిన అగ్ర నటుల్ని ఈ ప్రాజెక్టులో భాగస్వాముల్ని చేయాలని అమీర్ భావిస్తున్నారట. ఇందులోని వివిధ పాత్రలకు సౌత్ నుంచి మరికొందరు హీరోలను కూడాతీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో తెలియనున్నాయి.

# మొదలైంది.. ఈసారి ముగిద్దాం!



అగ్ర హీరో పవన్‌కల్యాణ్ ఏపీ పాలిటిక్స్‌లో బిజీగా ఉండటం వల్ల.. ఆయన ముందుగా ఒప్పుకున్న సినిమాలు ఆలస్యం అవుతూవచ్చాయి. వాటిల్లో ఒకటైన 'హరిహరవీరమల్లు' సినిమా షూటింగ్‌ని ఇటీవలే పూర్తి చేసిన పవన్‌కల్యాణ్... ఇప్పుడు 'ఓజీ' సెట్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఈ విషయాన్ని ఆ చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించలేదు కానీ.. 'మళ్లీ మొదలైంది.. ఈసారి ముగిద్దాం..' అనే క్యాప్షన్‌ని తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేసి పవర్ స్టార్ అభిమానులకు శుభవార్త పాస్ చేసింది. అలాగే ఈ షెడ్యూల్‌లోనే చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు హింట్ కూడా ఇచ్చారు. షూటింగ్‌కి సంబంధించిన ఫొటోను కూడా పోస్ట్‌లో జత చేశారు. సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ గ్యాంగ్ స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌లో పవన్‌కల్యాణ్ సరసన ప్రియాంక మోహన్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ఇందులో విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి కె.చంద్రన్, సంగీతం: ఎస్.థమన్.

# తెలుగు సంప్రదాయం ప్రతిబింబించే కథ




'ఎన్టీఆర్ ఘాట్ నాకు పుణ్యక్షేత్రం. ఎన్టీఆర్ అభిమానులకు ఇది శక్తినిచ్చే స్థలం. అలాంటి గొప్ప స్థానంలో ఎన్టీఆర్ ముని మనవడి సినిమా ప్రారంభోత్సవం జరగడం నాకెంతో ఆనందంగా ఉంది. ఇది ఒక మిసైల్ లాంచింగ్‌లా నాకనిపిస్తుంది. ఇది నా జీవితంలోనే మరపురాని ఘట్టం.' అని దర్శకుడు వైవీఎస్ చౌదరి అన్నారు. స్వర్గీయ మహానటుడు డా.ఎన్టీరామారావు ముని మనవడు, దివంగత హరికృష్ణ మనవడు, దివంగత జానకిరామ్ తనయుడు యంగ్ హీరో నందమూరి తారక రామారావు హీరోగా, వీణారావు హీరోయిన్‌గా తెరంగేట్రం చేస్తున్న చిత్రం ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో ఉన్న ఎన్టీఆర్ ఘాట్ వద్ద వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఈసినిమా దర్శకుడు వైవీఎస్ చౌదరి పై విధంగా స్పందించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాలోని తన పాత్ర కోసం మా యంగ్ ఎన్టీఆర్ కొన్ని రోజులుగా చాలా కష్టపడుతున్నారు. ఆయనకు నందమూరి కుటుంబ సభ్యుల సపోర్ట్ ఉంది. నందమూరి వీర అభిమానిగా తెలుగు సాహిత్యం, సంప్రదాయం, హైందవ సంస్కృతి నేపథ్యాలతో ఎంతో కష్టపడి ఒక మంచి కథ తయారు చేశా. కష్టపడి పనిచేస్తాం. మా కష్టాన్ని చూడండి. ఆశీర్వదించండి.' అని తెలిపారు వైవీఎస్ చౌదరి. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నారా భువనేశ్వరి క్లాప్ ఇవ్వగా, దగ్గుబాటి పురంధేశ్వరి కెమెరా స్విచాన్ చేశారు. గారపాటి లోకేశ్వరి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అతిథులంతా చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. NTR (న్యూ టాలెంట్ రోర్స్) పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, పాటలు: చంద్రబోస్, నిర్మాత: యలమంచిలి గీత.

# ఎన్టీఆర్ సినిమాలో అతిథిగా?




వైవిధ్యమైన కథా చిత్రాలతో బాలీవుడ్‌లో ప్రతిభావంతురాలైన నాయికగా గుర్తింపును తెచ్చుకుంది శ్రద్ధాకపూర్. 'సాహో' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలైందీ భామ. తాజా సమాచారం ప్రకారం ఎన్టీఆర్-ప్రశాంత్‌నీల్ కాంబోలో రూపొందుతున్న 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో శ్రద్ధాకపూర్ ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలిసింది. ఇటీవలే ఈ సినిమా షూట్‌లో ఎన్టీఆర్ జాయిన్ అయ్యారు. ఆయన్ని మునుపెన్నడూ చూడని విధంగా అత్యంత శక్తివంతమైన పాత్రలో ఆవిష్కరిస్తూ దర్శకుడు ప్రశాంత్‌నీల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారని అంటున్నారు. ఈ సినిమా ద్వితీయార్ధంలో వచ్చే కీలకమైన పాత్ర కోసం చిత్ర బృందం శ్రద్ధాకపూర్‌ను సంప్రదించినట్లు తెలిసింది. తక్కువ నిడివి కలిగిన అతిథి పాత్రే అయినా కథను మలుపుతిప్పే విధంగా ఉంటుందని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రవిబస్రూర్ స్వరకర్త. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# లక్ష్యఛేదనలో...



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తమ్ముడు'. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో అగ్ర నిర్మాత దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ కథానాయికలు. జూలై 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచార పర్వాన్ని మొదలుపెట్టారు. 'మూడ్ ఆఫ్ తమ్ముడు' పేరుతో సినిమాలోని పాత్రల్ని పరిచయం చేస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. కథాగమనంలో ఆయా పాత్రలు ఎలా ఉండబోతున్నాయో ఈ వీడియోను చూస్తే అర్థమవుతున్నది. చివరిగా నితిన్ లక్ష్యానికి గురిపెట్టి బాణాన్ని సంధించిన తీరు హైలైట్‌గా నిలిచింది. 'కాంతార' ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ గూజ్‌బంప్స్ తెప్పించేలా ఉంది. లక్ష్యఛేదనలో ఓ యువకుడి పోరాటం ఏమిటన్నదే ఈ సినిమా కథాంశమని, ఫ్యామిలీ ఎలిమెంట్స్ కలబోసిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు. స్వసిక విజయన్, బేబీ శ్రీరామ్ ఆదిత్య తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాతలు: దిల్ రాజు, శిరీష్, రచన-దర్శకత్వం: శ్రీరామ్ వేణు.

# కార్తీక్ జీవిత ప్రయాణం




నాగశౌర్య నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రీకరణ పూర్తి చేసుకుంది. రామ్ దేశినా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయని, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని చిత్ర బృందం పేర్కొంది. ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. కార్తీక్ అనే యువకుడి జీవిత ప్రయాణం, లక్ష్యసాధనలో ఎదురైన సవాళ్లు, సంఘర్షణ నేపథ్యంలో ఎమోషనల్ డ్రామాగా సినిమా ఆకట్టుకుంటుందని, నాగశౌర్య క్యారక్టర్‌ను ప్రజెంట్ చేస్తూ విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌కి అద్భుతమైన స్పందన లభించిందని మేకర్స్ తెలిపారు. విధి, సముద్రఖని, వీకే నరేష్, సాయికుమార్, మైమ్ గోపి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హారిస్ జైరాజ్, నిర్మాణ సంస్థ: శ్రీవైష్ణవి ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రామ్ దేశిన.



# జూన్‌లో రానున్న 'దీక్ష'


కిరణ్, అలేఖ్య రెడ్డి జంటగా నటించిన చిత్రం 'దీక్ష'. ప్రతాని రామకృష్ణ గౌడ్ దర్శకత్వం వహించారు. సందేశంతో కూడిన కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కించారు. చిత్రీకణ పూర్తయిందని, జూన్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ పేర్కొన్నారు. దర్శకనిర్మాత ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ.. సంకల్ప బలం ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చునే సందేశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, కథలోని మైథలాజికల్ ఎలిమెంట్ ఆసక్తికరంగా ఉంటుందని, ఆక్సఖాన్ ప్రత్యేక గీతం యువతను ఆకట్టుకుంటుందని చెప్పారు. దీని తర్వాత తమ సంస్థలో 'కబడ్డీ' అనే చిత్రాన్ని రూపొందిస్తున్నామని, ఇక నుంచి ఏడాదికి రెండు సినిమాలు తీసేలా ప్లాన్ చేస్తున్నామని ఆర్.కె.గౌడ్ పేర్కొన్నారు. ఆర్.కె.ఫిల్మ్స్, సిగ్ధ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాజ్‌కిరణ్ సంగీత దర్శకుడు. ఆర్.కె.గౌడ్, పి.అశోక్‌కుమార్ నిర్మాతలు.

# కేంద్రం అంటే బాలీవుడ్‌కు భయం!



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడటానికి బాలీవుడ్ తారలు భయపడతారని, ఎలాంటి విమర్శలు చేసినా దర్యాప్తు సంస్థల నుంచి వేధింపులు ఎదుర్కోవాల్సి ఉంటుందనే అభద్రతాభావం వారిలో ఉందని ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ అన్నారు. సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్‌తో టీవీషోలో జరిగిన చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'చాలా మంది బాలీవుడ్ తారలు ప్రభుత్వంపై విమర్శ చేయాలంటే భయపడతారు. ఏమైనా అంటే ఇన్‌కమ్‌టాక్స్, ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల నుంచి విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అదే హాలీవుడ్ నటులు అమెరికా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్భయంగా తమ భావాల్ని వ్యక్తం చేస్తారు. ఇటీవల మెర్లీ స్ట్రీప్ అనే అమెరికన్ నటి ప్రభుత్వాన్ని విమర్శించినా ఆమెకు ఎలాంటి వేధింపులు ఎదురుకాలేదు. కానీ భారత్‌లో అలా కాదు. ఇక్కడ తారలందరూ దర్యాప్తు సంస్థల భయంతో మౌనంగా ఉండిపోతారు. బాలీవుడ్‌ను వెనక నుంచి నడిపించేది మొత్తం బడా పారిశ్రామికవేత్తలే. వారితో పోరాడేంత పెద్దవారు కాదు సినీ తారలు' అని జావేద్ అక్తర్ అన్నారు. బాలీవుడ్ తారలు గొప్ప పేరు ప్రఖ్యాతులతో విలాసవంతమైన జీవితాల్ని గడుపుతున్నా..ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకునే విషయాల్లో వారు కూడా సామాన్యుల తరహాలోనే ఆలోచిస్తారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు తాను నిరంతరం సోషల్‌మీడియాలో ట్రోలింగ్‌ను ఎదుర్కొంటున్నానని, ఓ పౌరుడిగా సమస్యలపై స్పందించడం తన ధర్మమని జావేద్ అక్తర్ పేర్కొన్నారు.

# ఈ కాలయంత్రం ప్రయాణం ఏ కాలానికో?



బాలకృష్ణ 'ఆదిత్య 369' ఇటీవలే రీరిలీజై.. థియేటర్లలో ఓ రేంజ్‌లో సందడి చేసింది. దేశంలోనే తొలి టైమ్ ట్రావెల్ మూవీగా చరిత్ర సృష్టించిన సినిమా 'ఆదిత్య 369'. అందుకే.. ఈ సినిమా అంటే ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అభిమానం. దీనికి సీక్వెల్‌గా 'ఆదిత్య 999' ఉంటుందని కొన్నేళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. హీరో బాలకృష్ణ, దర్శకుడు సింగీతం శ్రీనివాసరావులు కూడా పలు సందర్భాల్లో 'ఆదిత్య 999' గురించి ప్రస్తావిస్తూ వచ్చారు. అయితే.. అది కార్యరూపం మాత్రం దాల్చలేదు. దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు వయసును దృష్టిలో పెట్టుకొని.. ఓ దశలో ఆ సినిమాను బాలకృష్ణే డైరెక్ట్ చేయాలని భావించారు. ఈ సినిమా ద్వారానే తన తనయుడు మోక్షజ్ఞను టాలీవుడ్‌కి పరిచయం చేయాలని కూడా ఆయన అనుకున్నారు. కానీ బాలయ్యకున్న కమిట్‌మెంట్లు, బిజీ షెడ్యూల్స్ వల్ల.. 'ఆదిత్య 999' ఓ టిపిక్‌గానే మిగిలిపోయింది. అయితే.. ఎట్టకేలకు ఆ కథ సెల్యులాయిడ్ మీదుకు వెళ్లే సమయం ఆసన్నమైనట్టు తెలుస్తున్నది. 'ఆదిత్య 999' బాధ్యతను దర్శకుడు క్రిష్ జాగర్లమూడికి అప్పగించారట నందమూరి బాలకృష్ణ. ఆర్కా మీడియా పతాకంపై ఈ సినిమా రూపొందనున్నట్టు తెలుస్తున్నది. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్‌లో ప్రస్తుతం క్రిష్ బిజీగా ఉన్నారట. సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు సంభాషణలు అందించనున్నట్టు వినికిడి. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. బాలయ్య నట వారసుడు మోక్షజ్ఞ తెరంగేట్రం కూడా ఈ సినిమాతోనే ఉంటుందట. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది.

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మోహన్ వడ్లపట్ల సినిమా



మోహన్ వడ్లపట్ల స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'M4M'(Motive for Murder) చిత్రానికి ప్రతిష్టాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 17న సాయంత్రం 6గంటలకు కేన్స్‌లోని 'PALAIS – C' థియేటర్‌లో ఈ సినిమా ప్రైవేట్ స్క్రీనింగ్ జరుగనున్నది. ఈ సందర్భంగా ముంబయ్ IMPPA ప్రివ్యూ థియేటర్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. కేన్స్ ఫెస్టివల్‌లో తన సినిమా స్క్రీనింగ్ జరగడం పట్ల మోహన్ వడ్లపట్ల ఆనందం వెలిబుచ్చారు. త్వరలోనే ఈ సినిమాను తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేస్తామని ఆయన తెలిపారు. మర్డర్ మిస్టరీతో థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందింది. అమెరికన్ నటి జో శర్మ ఇందులో ప్రధాన పాత్ర పోషించారు.

# ప్రజాపక్షం వహించే ప్రతినిధి



రామ్ పోతినేని హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. 'RAPO22' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేష్‌బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీబోర్సే కథానాయిక. ప్రస్తుతం షూటింగ్ జరుగుతున్నది. పీరియాడిక్ డ్రామాగా రూపొందిస్తున్న ఈ సినిమాలో హీరో రామ్ పాత్ర వినూత్న పంథాలో ఉంటుందని చిత్రబృందం చెబుతున్నది. ఈ సినిమాలో కన్నడ అగ్ర నటుడు ఉపేంద్ర కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. సూర్యకుమార్‌గా ఆయన పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. న్యాయం కోసం ప్రజల పక్షాన పోరాడే ప్రతినిధిగా ఆయన పాత్ర సాగుతుందని సమాచారం. సోమవారం ఉపేంద్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ నెల 15న సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నారు. రావు రమేష్, మురళీశర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్-మెర్విన్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మహేష్ బాబు.పి.

# నాన్నగారి ఇమేజ్ నటిగా నాకొక ఛాలెంజ్



'ఇందులో నా పాత్ర బోల్డ్‌గా బబ్లీగా ఉంటుంది. అలాగే హానెస్ట్ పర్సన్ కూడా. నా ఒరిజినల్ క్యారెక్టర్‌కి దగ్గరగా ఉండే పాత్రను ఇందులో చేశాను. క్లారిటీ, విజన్ ఉన్న మంచి దర్శకుడు విజయ్. కథానుగుణంగా నా పాత్రను గొప్పగా డిజైన్ చేశారు.' అని కథానాయిక అదితి శంకర్ అన్నారు. ప్రఖ్యాత దర్శకుడు శంకర్ కుమార్తె అయిన అదితి.. 'భైరవం' చిత్రం ద్వారా కథానాయికగా తెలుగుతెరకు పరిచయం అవుతున్నారు. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కి విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత.

ఈ నెల 30న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అదితి శంకర్ సోమవారం హైదరాబాద్‌లో విలేకరులతో ముచ్చటించారు. 'గొప్ప దర్శకుడిగా మా నాన్న ఇమేజ్‌ని గౌరవంగా భావిస్తా. అలాగే నటిగా నాకది ఛాలెంజ్ కూడా. అందుకని ఒత్తిడిగా మాత్రం ఫీలవ్వను. నాన్నతో కలిసి షూటింగులకు హైదరాబాద్ వచ్చేదాన్ని. ఇప్పుడు సొంత సినిమాకోసం ఇక్కడకు వచ్చి షూటింగ్ చేయడం ఓ గొప్ప అనుభూతి. తెలుగులో పనిచేయాలని ఎప్పట్నుంచో ఉంది. ఇలాంటి మంచి సినిమా ద్వారా పరిచయం కావడం ఆనందంగా ఉంది. ఇందులోని ముగ్గురు హీరోల్లో మనోజ్ నాకు తెలుసు. సెట్‌లో నన్ను చూసి 'ఇక్కడేం చేస్తున్నావ్?' అనడిగారు. సినిమాలో నటిస్తున్నానని చెప్పాను. అది రియల్లీ ఫన్ మూమెంట్. అలాగే బెల్లంకొండ సాయిగారు డౌన్ టు ఎర్త్ పర్సన్. రోహిత్ నైస్ పర్సన్. ముగ్గురూ తమిళం బాగా మాట్లాడతారు. అందుకే నాకు పెద్ద ఇబ్బంది అనిపించలేదు.' అని చెప్పారు అదితి శంకర్. 'మగధీర' తెలుగులో తన ఫేవరెట్ మూవీ అని, రాజమౌళి, రామ్‌చరణ్‌లకు తను పెద్ద అభిమానినని, హిస్టారికల్, పిరియాడిక్ సినిమాలు, అలాగే ఛాలెంజింగ్ విమెన్ రోల్స్ చేయాలని ఉందని అదితి శంకర్ తెలిపారు.